క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు శనివారం తెలిపారు. 11కేవీ పరిధిలోని గొల్లగూడ, జిల్లా కోర్టు ప్రాంతం, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, బస్టాండ్, పెద్దబండ, కలెక్టరేట్ ఏరియా, కేశవనగర్, ఫారెస్టు ఆఫీస్‌రోడ్డు, నటరాజ్ థియేటర్‌రోడ్డు, బొట్టుగూడ, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, ప్రకాశంబజార్, మిర్యాలగూడరోడ్డు, రెహమత్‌నగర్, అన్నారీకాలనీ, డాక్టర్స్ కాలనీలో ఉదయం 8గంటల నుంచి 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థి అభిరామ్‌కు సన్మానం



అభిరామ్‌ను సన్మానిస్తున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ : నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్‌లో ఈ నెల 19 నుంచి 30 వరకు నిర్వహించే శిక్షణలో నల్లగొండ జిల్లా నుంచి అభిరామ్ పాల్గొంటున్నట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. శనివారం పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కార్యక్రమం ఇస్రో–యువిక–2025 శిక్షణకు ఎంపికైన విద్యార్థి అభిరామ్‌ను ఆయన అభినందించి శాలువా, మెమెంటోతో సత్కరించారు. అభిరామ్ చింతపల్లి కేంద్రియ విద్యాలయంలో పదోతరగతి చదువుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, రామచంద్రయ్య, మోహన్‌రావు, అద్దంకి సునిల్‌కుమార్, రాజేందర్, ఆరూరి జానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

28న పూలే, అంబేడ్కర్ జనజాతర సభ

నల్లగొండ టౌన్ : భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అణిచివేత ఆధిపత్యంపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఈ నెల 28న పట్టణంలోని గడియారం సెంటర్‌లో పూలే, అంబేడ్కర్ జనజాతర సభ నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. శనివారం పట్టణంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో చొల్లేటి ప్రభాకర్, దుడుకు లక్ష్మీనారాయణ, బర్రె సుదర్శన్, కత్తుల షణ్ముఖ, బకరం శ్రీనివాస్, పందుల సైదులు, జగన్, సైదులు పాల్గొన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి



ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విష్ణుమూర్తి

కనగల్ : రాత్రి వేళల్లో ప్రమాదాలు నివారించేందుకు వాహనాల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా ఆఫిక్స్ చేయాలని ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్లకు ఎస్ఐ విష్ణుమూర్తి అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని శేరిలింగోటం, తిమ్మన్నగూడెం ఇసుక రీచ్‌ల చెక్‌పాయింట్లను ఆయన తనిఖీ చేసి వారితో మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ

కట్టంగూర్ : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వెంకయ్య అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరా, పరిసరాల శానిటేషన్‌ను, కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ చలపతి, కార్యదర్శి అనిల్ ఉన్నారు.

ప్రయాణికులే ఆర్టీసీకి మూలాధారం

రామగిరి(నల్లగొండ) : ప్రయాణికులే ఆర్టీసీకి మూలాధారమని ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ మేనేజర్ కొణతం జానిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులకు ఆర్టీసీ లోగో ఉన్న కీచైన్‌ను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ప్రచారానికే పరిమితమైన సేంద్రియ ఎరువు తయారీ
- గ్రామాల్లో ప్రధాన రోడ్ల వెంట దర్శనమిస్తున్న చెత్తాచెదారం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కేతేపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు, గ్రామ పంచాయతీకి ప్రత్యామ్నాయ నిధులు సమకూర్చాలనే సంకల్పంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా సెగ్రిగేషన్ (కంపోస్టు) షెడ్లను ఏర్పాటు చేసింది. దీంతో గ్రామాల్లో సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశంతో వాటిని చేపట్టారు. కానీ ప్రస్తుతం అవి ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కన్పించడం లేదు. ప్రారంభ దశలో వాటి నిర్వహణపై ఆసక్తి కనబర్చిన అధికారులు కాలక్రమేణ వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

ప్రభుత్వ ధనం వృథా..

మండలంలో 16 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఉపాధిహామీ పథకం కింద రూ.5లక్షలు వెచ్చించి ప్రతి గ్రామ పంచాయతీకి ఓ డంపింగ్‌యార్డు, కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు చెత్త తరలించడానికి ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లను కొనుగోలు చేసింది. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికీ బుట్టలు సైతం పంపిణీ చేశారు. సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు



కొప్పోలులో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

డంపింగ్‌యార్డుకు తరలించాలి. అక్కడ ప్లాస్టిక్, గాజు, ఇనుము, కాగితం తదితర వస్తువులను వేరు చేసి కంపోస్టు షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదులలో నిల్వ చేయాలి. పొడి చెత్తను అమ్మి ఆ సొమ్మును గ్రామపంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి. తడి చెత్తను దాదాపు 45రోజుల పాటు దశలవారీగా సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం అటువంటి పనులేవి ఏ గ్రామంలో కూడా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

డంప్‌యార్డులకు చేరని చెత్త..

పలు గ్రామాల్లోని చెత్త డంపింగ్ యార్డులకు తరలడం లేదు. గ్రామాల్లోని రోడ్ల వెంటనే దర్శనమిస్తుంది. రోడ్ల వెంట రోజుల తరబడి చెత్త నిల్వ ఉంటుండడంతో దుర్వాసన రావడంతో సమీప నివాసాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేల చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఇనుపాములలో రోడ్డు వెంట వేస్తున్న చెత్త

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాలలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామాల్లో చెత్తను రోజువారీగా డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రతి షెడ్డులో ఎరువులు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం.

– బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కేతేపల్లి

ప్రేమ, కరుణతో మెలగాలి : గుత్తా

రామగిరి(నల్లగొండ) : ప్రతిఒక్కరూ ప్రేమ, కరుణ భావాలతో మెలగాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగ సందర్భంగా పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల మరియరాణి కేథిడ్రల్ చర్చి నుంచి నిర్వహించే రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాంతిమార్గాన్ని సూచించిన గొప్ప వ్యక్తి ఏసు ప్రభువని కొనియాడారు. అనంతరం బిషప్ కరణం ధమన్‌కుమార్ మాట్లాడారు. అదే విధంగా గుడ్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్, బేతనియ క్రిస్టియన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీ కాలేజీ నుంచి రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకురాలు దాసరి ప్రీతి ప్రశాంత్‌కుమార్, టీఎస్ క్రిష్టోఫర్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ కత్తి డేవిడ్ రాజు, పసల శౌరయ్య, టి.ఎలిషా, పాస్టర్ జాకబ్, ప్రదీప్‌సామ్యేల్, డాక్టర్ బి.ప్రవీణ్‌కుమార్, ఎస్.జయప్రకాష్, పీజే జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న సుఖేందర్‌రెడ్డి, బిషప్ ధమన్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, క్రైస్తవులు



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు, నాయకులు

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : నియోజకవర్గంలో సాగునీటికి సంబంధించిన పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో నీటి పారుదల పరిధిలో పెండింగ్‌లోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న మినీ ట్యాంక్‌బండ్ పనులు చేపట్టాలన్నారు. వాగులపై అవసరమైన చెక్‌డ్యాంలు నిర్మించడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదల ఈఈ ప్రభుకల్యాణ్, డీఈలు సునీత, వాణి, భూష్మాచారి, మారం శ్రీనివాస్‌లు, ఆయా మండలాల ఏఈలు పాండునాయక్, శరత్‌చంద్ర, సాయికృష్ణ, వాసవీ, కలీల్‌అహ్మద్, మహేష్, సుచరిత, సంతోష్, చందన సిబ్బంది పాల్గొన్నారు.



ఐబీ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని తాటికల్, మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తాటికల్ జెడ్పీ హైస్కూల్‌లో రూ.25లక్షలతో చేట్టిన సీసీరోడ్డు, ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మండల విద్యాధికారి మేకల నాగయ్య, నకిరేకల్, మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు కోదాటి రాములు, కర్ర వీరారెడ్డి, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాదగోని కొండయ్య, చెనగాని సుధాకర్, మిర్యాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని ఏపూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ పాఠశాల ప్రత్యేకతలతో కూడిన ప్రచార కరపత్రాలతో వారు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఎలికట్టెలో జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఆ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాంభూపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలలో ఉపాధ్యాయులు గరిషే అంజయ్య, రవి, వెంకన్న, రామ్మోహన్ పాల్గొన్నారు.

అక్కెనపల్లిలో బడిబాట..

నార్కట్‌పల్లి : మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో శనివారం మండల నోడల్ ఆఫీసర్ నడింపల్లి వెంకటేశం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మధనయ్య, వెంకటేశం, లింగారెడ్డి, ఇమాం ఖరీం, ఈదయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కేతేపల్లి : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ శనివారం మండలంలోని ఇనుపాముల, బండపాలెం గ్రామాలలో ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, కల్పిస్తున్న వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో బండపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంజనేయులు, ఉపాధ్యాయులు కె.వెంకట్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, జి.శ్రీనివాస్, ఎస్.దీప్తి, పి.సుగుణమ్మ, వై.ఎల్లయ్య, ఎండీ.అజీజ్‌అహ్మద్, సీఆర్పీ కె.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో బడిబాట ప్రచార ర్యాలీలు

తిప్పర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి పానుగోటి నర్సింహానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టిప్రోలు సదానందం, భిక్షపతి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, జ్యోతి, ప్రభావతి, హెమిమా మెర్సి, వెంకటయ్య, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

కట్టంగూర్ : బడిఈడు పిల్లలను పాఠశాలలో చెర్పించాలని కోరుతూ శనివారం మండలంలోని దుగినవెల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు కరుణాదేవి, మురళయ్య, లలితాజ్యోతి, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, పీఈటీ సైదులు ఉన్నారు.

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని హెచ్‌ఎం పాల్వాయి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నాగయ్య, డి.మంజులత, బాలాజీనాయక్, లక్పతి, పల్లవి ఉన్నారు.

శాలిగౌరారం : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాధికారి సైదులు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆకారం, శాలిగౌరారం, మాధారంకలాన్ గ్రామాలలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



నకిరేకల్ : బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం, విద్యార్థులు, తదితరులు



కేతేపల్లి : ఇనుపాములలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తిప్పర్తి : ర్యాలీలో పాల్గొన్న విద్యాధికారి



కట్టంగూర్ : దుగినవెల్లిలో..

మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేట్ కోఆర్డినేటర్ మల్లీశ్వరీ

నకిరేకల్ : మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ బోస్కో సేవా కేంద్రం తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ మల్లేశ్వరి అన్నారు. బోస్కో సేవా కేంద్రం హైదరాబాద్‌వారి సహకారంతో ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నడిగూడెంలో 'మహిళల జీవనశైలీ – ఆరోగ్యం, పరిశుభ్రత' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల ప్రభావంతో మహిళల జీవన విధానంలో మార్పులు సంభవిస్తున్నాయని, దీంతో వారు ఎన్నో ఆరోగ్య సమస్యలకు లోనవుతున్నారని అన్నారు. మహిళలు సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సొసైటీ చైర్మన్ వాడపల్లి రమేష్, సొసైటీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కనగల్ : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని పగిడిమర్రి, శాబ్దుల్లాపురం, ఏమిరెడ్డిగూడెంతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఆయన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులకు కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. తేమశాతాన్ని దృష్టిలో ఉంచుకుని కాంటా వేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా ఉంచుకుని ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఎం సంకు హరి, మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి సీసీలు విజయలక్ష్మి, ప్రభాకర్, ఐకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ కృష్ణ నాయక్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తీరును ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట రైతులు చేకూరి గణేష్, కుర్రు యాదయ్య, రాకేష్, తిరుమలేష్ ఉన్నారు.

నాంపల్లి : కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. ఆయన వెంట సాయి, నితీష్‌చంద్ర, యాదమ్మ, శేఖర్‌రెడ్డి, యాదయ్య, రమేష్, రాములు, సత్తయ్య, రవి పాల్గొన్నారు.



కనగల్ : పగిడిమర్రి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

ఆత్మరక్షణకు కరాటే దోహదం

మర్రిగూడ : విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలోని మూడు నెలల పాటు కరాటే శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు శనివారం పాఠశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు బరిగెల దుర్గాప్రసాద్, దుబ్బాక నగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

రామగిరి(నల్లగొండ) : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశ్చిమబెంగాల్లో వక్ఫ్ బోర్డ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లలో హిందువులను టార్గెట్ చేస్తూ హిందువు ఇళ్లల్లోకి చొరబడి వేట కొడవళ్లతో మహిళలపై హత్యలు, అత్యాచారాలు చేస్తూ ఆస్తులను ధ్వంసం చేస్తూ హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటానికి ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నల్లగొండ విభాగ కార్యదర్శి గంజి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, జిల్లా సహ కార్యదర్శి జూకురి సంపత్‌వర్మ, జిల్లా విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు రాయల కృష్ణయ్య, జిల్లా సంఘటన మంత్రి వంశీ, జిల్లా సేవా ప్రముఖ గోవర్ధన్, ధర్మప్రసాద్ జిల్లా ప్రముఖ కోటగిరి సంతోష్, ధర్మాచార్య సంపర్క ప్రముఖ ప్రకాష్ భజరంగ్‌దళ్ సంయోజక్ నరసింహ జిల్లా సత్సంగ్ ప్రముఖ బల్లెం యాదిగిరి, నగర ఉపాధ్యక్షుడు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మునుగోడు : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే, పుట్టిన బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీఓ లావణ్య అన్నారు. పోషణ అభియాన్‌లో భాగంగా మండలంలోని కొంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చండూరు : మండలంలోని బంగారిగడ్డ, అంగడీపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం పోషకాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదగిరి, పంచాయతీ కార్యదర్శి కోటయ్య, ఏఎన్‌ఎంలు మాధవిలత, కిరణ్‌కుమారి, వీఓఏలు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని వనిపాకల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు తీసుకోవల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె ఆసుపత్రి వైద్యురాలు శివాని, హెచ్‌ఎంలు శ్రీనయ్యాచారి, కౌసల్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్ మేడి జానకమ్మ, ఏఎన్‌ఎం స్వప్న, ఆశ కార్యకర్తలు నీరజ, లక్ష్మి పాల్గొన్నారు.

కనగల్ : మండల కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై సీడీపీఓ హరిత, ఎంపీడీఓ జయరాం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సంకు హరి, ఏపీఓ సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, మంజుల అంగన్‌వాడీ సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కట్టంగూర్ : ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ అస్రు అంజుమ్ అన్నారు. శనివారం మండలంలోని పామనగుండ్ల, ఎరసానిగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.మంగమ్మ, నవనీత ఉన్నారు.



చిట్యాల : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్, వైద్యసిబ్బంది

సంక్షిప్త సమాచారం

పిడుగుపాటుకు గేదె, ఎద్దు మృతి

మునుగోడు : పిడుగుపాటుకు ఓ పాడి గేదె, ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని రత్తిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందినా నెల్లికంటి చంద్రయ్యకు గల పాడి గేదె, రెండు ఎద్దులు ఉన్నాయి. అయితే వాటిని ప్రతి రోజు వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికి వస్తాడు. అదే తరహాలో శుక్రవారం తన పశువులను కట్టేసి ఇంటికి రాగా వర్షంతో పాటు పెద్ద ఉరుములు, మెరుపులతో పిడుగుపడడంతో గేదెతో పాటు ఓ ఎద్దు మృతి చెందినట్లు వాటి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

వంట పాత్రలను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి : పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వంట పాత్రలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ ఆకవరం రాజేంద్రప్రసాద్ కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పాఠశాలల హెచ్‌ఎంలకు ఆయన వంట పాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కేతేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం వై.నర్సిరెడ్డి, గెజిటెడ్ హెచ్‌ఎంలు వెంకట్‌రెడ్డి, రమేష్, ముషం వెంకటేశ్వర్లు, పద్మ, వి.రాధాక్రిష్ణమాచార్యులు, ఉప్పు సునీత, శంకర్, ఎంఐఎస్ సైదులు, సీఆర్పీలు కె.మహేందర్, మల్లయ్య, ఎమ్మార్సీ సిబ్బంది హరి, రాజేందర్ పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

కనగల్ : మండలంలోని 29పాఠశాలలకు ప్రభుత్వం నుంచి వచ్చిన వంట సామగ్రిని శనివారం ఎంఈఓ పద్మ ఎంఆర్సీ భవనంలో పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు కృషిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. అందుకు వంట సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలి

నల్లగొండ టూటౌన్: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎంజీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ జాయింట్ సెక్రటరీలు రమావత్ మురళీ, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఒడిషాలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యూనివర్సిటీ తరఫున పాల్గొనేందుకు శనివారం ఎంజీయూలో ఎంపిక పోటీలు నిర్వహించారు. నల్లగొండ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్. ప్రవళిక పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సోమలింగం, ఎం. పవన్, లింగం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నార్కట్‌పల్లి : మండలంలోని నెమ్మాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–1999లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్‌రెడ్డి, సత్తిరెడ్డి, పర్వతం వేణు, వెంకటేశ్వర్లు, సంధ్య, శారద, రవి, గణేష్, శ్రీను, పద్మ, శోభ, లింగారెడ్డి, మురళి, రమేష్, వరప్రసాద్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

నకిరేకల్: బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని మెయిన్‌సెంటర్‌లో శనివారం ఎస్ఐ లచ్చిరెడ్డి సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నకిరేకల్‌లోని మార్కెట్ రోడ్డుకు చెందిన షేక్ యాకూబ్ బైక్‌పై వెళ్తుండగా ఆపారు. సరైన ధ్రువపత్రాలు చూపకపోవడంతో అనుమానంతో విచారించగా. రెండు బైక్‌లను చోరీ చేసినట్లు యాకూబ్ అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.